10112024-DIS-04_Layout 1 11/10/2024 3:16 AM Page 1

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

అన్నింటా విఫలమైన అబద్ధాల పాలన

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు వినిపించిన, ఆ తర్వాత కూడా రాష్ట్రంలో ఎక్కువగా వినిపిస్తున్న మాట 'అప్పులు'. ఇంకా చెప్పాలంటే ఎన్నికల్లో ఈ అంశమే కీలకపాత్ర పోషించింది. కేసీఆర్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అప్పట్లో కాంగ్రెస్ గల్లీ లీడర్ల నుంచి ఢిల్లీ లీడర్ల దాకా ఊదరగొట్టారు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై విష ప్రచారం చేశారు. అయితే, గతంలో అప్పుల గురించి నానా యాగీ చేసిన కాంగ్రెస్ నాయకులు.. తీరా అధికారంలోకి వచ్చాక అప్పులు చేయకుండా పాలన ఎట్లా సాగుతదని చెప్పుండటం గమనార్హం. అధికారంలోకి వచ్చి ఏడాది కూడా పూర్తి కాకముందే ఏకంగా రూ.75 వేల కోట్లకు పైగా అప్పులు చేశారు. పైగా వాటికి లెక్కాపత్రమూ లేదు. ఆ సొమ్మంతా ఎటుపోతుందో ఎవరికీ తెలియదు. కేసీఆర్ తాను చేసిన అప్పులతో రాష్ట్ర సంపదను పెంచారు, ఆస్తులను కూడబెట్టారు. కానీ, అటు సంపదను పెంచకుండా, ఇటు హామీలను అమలు చేయకుండా ఆ అప్పుతో కాంగ్రెస్ పాలకులు ఏం చేస్తున్నట్టు? ఆర్థిక విశ్లేషకులు, మేధావుల మదిని తొలచివేస్తున్న ప్రశ్నలివీ. రోజురోజుకు కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ విధానాలు, హస్తం పార్టీ పాలకులు చేసిన అప్పుల గురించి ఇప్పుడు ప్రస్తావించుకుందాం.

డి.పాపారావు

అప్పులు, ఆస్తులు అనేవి ఎంతో కీలకమైనవి. చేసిన అప్పులతో ఏం చేస్తున్నారనేది ప్రధానం. రాష్ట్రమైనా, దేశమైనా అప్పులతో ఆస్తులు, సంపదను గనుక కూడబెట్టుకుంటే.. ఆ అప్పులు రాష్ట్ర, దేశ నిర్మాణంలో కీలకపాత్ర పోషిస్తాయి. అలా కాకుండా చేసిన అప్పులను విందు భోజనంలా వాడుకుంటే మాత్రం అది నష్టదాయకమే. అందుకే, అప్పులను ఎందుకు తీసుకుంటున్నారు, ఎలా వినియోగిస్తున్నారనేది అత్యంత ప్రాధాన్యం.

కేసీఆర్ సర్కార్ చేసిన అప్పులపై గతంలో కాంగ్రెస్ నేతలు ఎక్కువగా విష ప్రచారం చేశారు. కానీ, కేసీఆర్ పాలనలో తెలంగాణ ఆర్థిక నిర్వహణ చాలా బాగుందని ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ (ఈపీడబ్ల్యూ) ఇటీవల కొనియాడింది. ఆర్థిక నిర్వహణ, ఉత్పాదకత తదితర అంశాల్లో దేశంలోని ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఈపీడబ్ల్యూ పొగిడింది. వాస్తవానికి, స్వరాష్ట్రంగా ఏర్పడేనాటికి తెలంగాణ మిగులు రాష్ట్రమే. తెలంగాణ ధనిక రాష్ట్రమని కేసీఆర్ చెప్పింది నిజమే. అయితే, అంత కుముందు ఉమ్మడి ఏపీలో ఆ నిధులు వేరే ప్రాంతాలకు తరలిపోయాయి. స్వరాష్ట్రంగా ఏర్పడిన తర్వాత ఇక్కడి నిధులు, వనరులను ఇక్కడే వాడుకునే వెసులుబాటు కలిగింది. దాన్ని కేసీఆర్ సద్వినియోగం చేసుకున్నారు. ఇక్కడి నిధులతో పాటు అప్పులు చేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారు. ఆస్తులను పెంచారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం, విద్యుత్తు ఉత్పత్తి పెంపు, విద్యుత్తు ట్రాన్స్‌మిషన్ లైన్ల నిర్మాణం, హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల కల్పన, ఇతర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే అందుకు నిదర్శనం. మరీ ముఖ్యంగా ఎవరూ ఊహించని విధంగా హైదరాబాద్‌లో మౌలిక వసతుల కల్పన జరిగింది. మన కండ్లముందు కనిపిస్తున్న ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, రోడ్లు, ఇతర నిర్మాణాలే అందుకు నిదర్శనం. ఈ క్రమంలోనే కేసీఆర్ పాలనలో అంతర్జాతీయంగా ఒక అభివృద్ధి నమూనాగా తెలంగాణ గుర్తింపు పొందింది. తెలంగాణలో జరిగిన అభివృద్ధి గురించి ఈపీడబ్ల్యూ మాత్రమే కాదు, గతంలో అనేక సంస్థలు కూడా ప్రస్తావించాయి. 'కేసీఆర్ ఉద్యమకారుడు మాత్రమేనని అనుకున్నాం. రాష్ట్రాన్ని ఆయన పాలించగలరా? అని మొదట్లో అనుమానపడ్డాం. కానీ, అడ్మిని స్ట్రేటర్‌గా, నిర్మాణదక్షుడిగా కేసీఆర్ నిరూపించుకున్నారు. ఎవరూ ఊహించని రీతిలో పరిపాలకుడిగా విజయవంతమయ్యారు' అని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చెప్పినట్టు కూడా నేను విన్నాను.

'మానవాళికి మహోదయం' పుస్తకం గురించి...

'మానవాళికి మహోదయం' పుస్తకం వ్యాసాల సంకలనం. 1999లో నేను జర్నలిస్టుగా పనిచేస్తున్న సమయంలో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, ముఖ్యంగా అమెరికా ఆర్థిక వ్యవస్థకు సంబంధించి రాసిన వ్యాసాలు అందులో ఉన్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అమెరికా గుండెకాయ లాంటిది. అందుకే అగ్రరాజ్యం ఆర్థిక వ్యవస్థ, విధానాలపై ఎక్కువ వ్యాసాలు రాశాను. సంక్షోభం దిశగా అమెరికా ఆర్థికవ్యవస్థ వెళ్తుందనే అంశంపై మొదటి వ్యాసం రాశాను. అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థ, సామ్రాజ్యవాదం, అమెరికా అప్పులు, దివాళా తదితర అంశాలపై ఆ తర్వాత అనేక వ్యాసాలు నా కలం నుంచి జాలువారాయి. ఆ వ్యాసాల సమాహారమే ఈ పుస్తకం. 1999-2003 వరకు రాసిన వ్యాసాలతో అప్పట్లో చిన్న పుస్తకం విడుదలైంది. 2003-2007 వరకు రాసిన వ్యాసాలతో మరో పుస్తకం వచ్చింది. 2007-12 వరకు రాసిన వ్యాసాలు, గత పుస్తకాల్లోని కొన్ని వ్యాసాలను కలిపి తాజాగా ఈ కొత్త పుస్తకం తీసుకొచ్చా.

కొంతమంది అమెరికా అప్పులతో కేసీఆర్ సర్కార్ చేసిన అప్పులను పోలుస్తుంటారు. అది సరికాదు. అమెరికాది అప్పు చేసి పప్పు కూడు వ్యవహారం. కేసీఆర్ అప్పులు చేసి ఆస్తులు నిర్మించారు. కానీ, అమెరికాకు సొంత ఆదాయ మార్గాలేమీ లేవు. ఒక్క ఆయుధాల అమ్మకం తప్ప. ఆ దేశం అన్ని సరుకులు దిగుమతి చేసుకోవాల్సిందే.

కేసీఆర్ సర్కార్ చేసిన అప్పులను, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అప్పులను పోల్చడం మూర్ఖత్వమే. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను కేసీఆర్ ఒక ప్రణాళిక ప్రకారం వినియోగించారు. సంపదను పెంచారు. కానీ, కాంగ్రెస్ చేస్తున్న అప్పులు అలా కాదు. వాటికి జవాబుదారీ ఎవరు? ఇప్పటి వరకు తెచ్చిన రూ.75-80 వేల కోట్లకు పైగా అప్పులతో ఏం చేశారనేది ఎవరికీ తెలియదు. దానిగురించి ప్రభుత్వం తరపున ఎవరూ వివరించడం లేదు. అంతేకాదు, ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో రూ.75 వేల కోట్ల దాకా ప్రభుత్వానికి ఆదాయం వచ్చింది. మరి ఆ సొమ్మంతా ఎటుపోయింది? ప్రభుత్వం ఆ నిధులను ఏం చేసింది? ఒక్క పథకం కూడా అమలుచేయడం లేదు. రైతుభరోసా సంగతేమో కానీ, రైతుబంధే ఇవ్వడం లేదు. ఆసరా పింఛన్లు సరిగ్గా ఇవ్వట్లేదు. రుణమాఫీ ఫెయిలైంది. మొదట రూ.41 వేల కోట్ల దాకా రుణాలున్నట్టు చెప్పి.. రూ.18 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారు. ఉచిత బస్సు పథకం మాత్రమే ఏదో ఉందా అంటే ఉందన్నట్టు నడుస్తున్నది.

రేవంత్ సర్కార్‌కు అసలు ఒక విధాన మంటూ లేదు. ప్రత్యేకించి, ఆర్థికపరమైన విషయాల్లో. గతేడాది ఏప్రిల్-సెప్టెంబర్ కాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.85 వేల కోట్లకు పైగా ఆదాయం వచ్చింది. కానీ, ఈ ఏడాది అది రూ.75 వేల కోట్లకు పడిపోయింది. ఈ నేపథ్యంలో కేసీఆర్ ప్రభుత్వాన్ని, రేవంత్ సర్కార్‌ను పోల్చడమంటే కేసీఆర్‌ను, నాటి ప్రభుత్వాన్ని అవమానించడమే. ఏ కేజ్రీవాల్ ప్రభుత్వంతోనో, ఇతర ప్రభుత్వాలతోనో కేసీఆర్ సర్కార్‌ను పోల్చాలే గాని రేవంత్ సర్కార్‌తో పోల్చడం సరికాదు. అసలు ఏ విషయంలోనూ రెండింటికి పోలికే లేదు. పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. వాస్తవానికి, అక్టోబర్ 1 నాటికి రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమవ్వాలి. ఆ సమయం మించిపోయి ఇప్పటికే నెల రోజులైంది. అయినా రాష్ట్రంలో కొనుగోళ్లు జరగడం లేదు. పంజాబ్‌లో ఇప్పటికే 85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగింది. కానీ, మన దగ్గర కనీసం కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనడం లేదు. కల్లాల్లో ఉన్న ధాన్యం వర్షాలకు తడిసి ముద్దవుతున్నది. అసలు కొంటారా? కొనరా? అని చెప్పే నాథుడే లేడు. దీంతో ప్రైవేట్ వ్యాపారులకు తెగనమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. నామమాత్రంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి పాలకులు చేతులు దులుపుకొన్నారు. ఆ కేంద్రాల్లో కొనుగోళ్లు అసలు జరగడం లేదు.

కొంతమేరకు కొనుగోలు చేసిన వాటికి డబ్బులు ఇవ్వడం లేదు. ఆదిలాబాద్ జిల్లాలో రెండు మూడు నెలల కిందట సోయాబీన్ పంట అమ్మిన రైతులకు ఇప్పటికీ నగదు అందలేదు. వాస్తవానికి వరి క్వింటాలుకు రూ.2,300కు పైగా ఎంఎస్పీ ఉన్నది. క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఈ లెక్కన క్వింటాలుకు రూ.2,800 దాకా ధర రావాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేయడంతో క్వింటాలు వరి రూ.1800కే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అంటే, ఒక క్వింటాలుకు రూ.1000 చొప్పున రైతన్నలు నష్టపోతున్నారు. ఇప్పటికే నాలుగింట ఒక వంతు ధాన్యం తక్కువ ధరకే విక్రయించేసినట్టు సమాచారం. అయినా ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మేల్కోవడం లేదు. కోతలు మొదలై, ప్రైవేటు వ్యాపారులకు తెగనమ్ముకుంటున్న ఈ సమయంలో ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకో ప్రత్యేక అధికారిని నియమించడం విడ్డూరం.

నవంబర్ 29న ప్రభుత్వం ఒక ఆశ్చర్యకరమైన ఆర్డర్‌ను పాస్ చేసింది. క్వింటాల్ ధాన్యానికి సుమారుగా 67 కిలోల బియ్యం మిల్లర్లు ఇవ్వాలనేది దాని సారాంశం. క్వింటాలు ధాన్యం మిల్లులో ఆడిస్తే అంత బియ్యం రాదని, సుమారుగా 50-55 కిలోల వరకు మాత్రమే వస్తుందని మిల్లర్లు ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. అంతేకాదు, బ్యాంకు గ్యారంటీలంటూ కొర్రీలు పెట్టి కొనుగోళ్లు జరగకుండా చేశారు. పైన చెప్పిన ఆర్డరు, బ్యాంక్ గ్యారంటీల లొల్లి ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ధాన్యం కొనుగోళ్లు జరగకుండా చేసేందుకే వీటిని తెరపైకి తెచ్చారేమో!

కాంగ్రెస్‌కు తెలంగాణ పట్ల గాని, ప్రజా సంక్షేమం పట్ల గాని ఏ మాత్రం చిత్తశుద్ధి లేదు. ఇటీవల రాష్ట్రానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వచ్చారు. ఎన్నికల సందర్భంగా గతంలో ఆయన ఎన్నో హామీలిచ్చిన సంగతి తెలిసిందే. మరి ఆ హామీల అమలు గురించి ఆయన కనీసం పట్టించుకుంటున్నారా? గంటకు పైగా రాష్ట్రంలో ఉన్న ఆయన ఎవరినీ కలవకుండానే వెళ్లిపోయారు. ప్రజల వద్దకు వెళ్లేందుకు ఆయనకు మొహం చెల్లకపోవడమే అందుకు కారణం. రేవంత్ పాలనలో అరిగోస పడుతున్న నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, ఆర్టిసీ కార్మికులు, ఆటోడ్రైవర్లు.. ఇలా ఏ వర్గం వద్దకైనా ఆయన వెళ్లగలరా? ఆఖరికి పోలీసుల దగ్గరకి కూడా వెళ్లలేని పరిస్థితి.

తెలంగాణను కాంగ్రెస్ అధిష్ఠానం ఒక పాడి ఆవులా వాడుకుంటున్నది. ఇక్కడినుంచి ఢిల్లీకి సూట్‌కేసులు వెళ్తున్నాయనేది ప్రధాన ఆరోపణ. ఆ తతంగం జరిగినంత కాలం రాష్ట్రంలో ఏం జరిగినా వాళ్లు పట్టించుకోరు. అందుకే, ఏం చేయాలో తెలియక కాంగ్రెస్ సీనియర్ నేతలు కూడా మిన్నకుంటున్నారు. తెలంగాణలో అసలు ప్రభుత్వమే లేదు. రాష్ట్రంలో ఫ్రీ ఫర్ ఆల్ నడుస్తున్నది. ఎవరికి ఇష్టమొచ్చింది వాళ్లు చేస్తున్నారు. అసలు ఈ ప్రభుత్వాన్ని ఎలా విమర్శించాలో, ఏమని విమర్శించాలో కూడా తెలియడం లేదు. కాయలున్న చెట్టుకే రాళ్ల దెబ్బలన్నట్టు.. పనిచేసే ప్రభుత్వంపైనే విమర్శలు వస్తాయి. పనిచేసే ప్రభుత్వం కాబట్టి, కేసీఆర్ సర్కార్‌ను అప్పట్లో కొందరు విమర్శించారు. అసలు ఈ ప్రభుత్వాన్ని విమర్శించడానికి ఏముంది? ఏదైనా పనిచేస్తేనే కదా విమర్శించేది. విమర్శించి.. విమర్శించి.. విమర్శ మీద మనకు విసుగొచ్చింది, ప్రభుత్వం మీద ప్రజలకు విసుగొచ్చింది.

రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా ఇష్టమొచ్చినట్టు గ్యారెంటీలు ఇచ్చుకుంటూపోతే కాంగ్రెస్‌కే నష్టం. ఈ విషయాన్ని కాంగ్రెస్ పెద్దలు ఇప్పుడు గ్రహించారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. త్వరలో ఎన్నికలు జరగనున్న మహారాష్ట్రలో మళ్లీ గ్యారెంటీలు ప్రకటించారు. ఇది ఇలాగే కొనసాగితే దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పతనం ఖాయం. భవిష్యత్తులో ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ గెలవదు, తెలంగాణలో అసలే గెలవదు.

(వ్యాసకర్త: ప్రముఖ ఆర్థిక నిపుణులు)

తెలంగాణ అప్పులమయం అయిందని చెప్పడం ఒక అబద్ధం. అప్పుల కుప్పగా మారిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ చేతిలో పెట్టారని, ఖాళీ ఖజానా అప్పగించారని అనడం పచ్చి అబద్ధం. అబద్ధమని ఎందుకు చెప్పాల్సి వస్తున్నదంటే.. రాష్ట్ర ఖజానా అనేది ఎప్పుడూ ఖాళీగా ఉండదు. రాష్ట్ర ఖజానా అంటే.. మన ఇంట్లో ఉండే బీరువా లెక్కన కాదు. అందులోని డబ్బులన్నీ వాడుకొని ఖాళీ చేయడానికి. ఇంటి ఖజానాకు, రాష్ట్ర ఖజానాకు చాలా వ్యత్యాసం ఉంటుంది. రాష్ట్ర ఖజానాలో నిరంతరంగా లావాదేవీలు జరుగుతుంటాయి. పన్నులు, ఇతర రూపాల్లో నిత్యం ఆదాయం వస్తుంటుంది, ఖర్చులు అవుతుంటాయి. అసలు ఖాళీ ఖజానా చేతికివ్వడానికి రాష్ట్ర ఖజానాలో నిల్వ అనేది ఉండదు.

బేబిచెన్ మ్యాథ్యూ

ట్రాఫిక్‌జామ్ వెనకున్న మతలబేమిటంటే!

బెంగళూరులోని ఎంజీ రోడ్డులో లేదా ఢిల్లీలోని రింగ్ రోడ్డులో మీరెప్పుడైనా ట్రాఫిక్‌జామ్‌లో ఇరుక్కున్నారా? ఒకవేళ ఇరుక్కుపోయి ఉంటే.. ఆ ప్రాంతాల్లో ఎందుకు ట్రాఫిక్‌జామ్ అయిందో మీకు తెలుసా? ఆ మార్గాల్లో ఎక్కువ కార్లు తిరుగుతుండటమే అందుకు కారణం. ప్రతిఒక్కరూ సొంత వాహనంలో వెళ్తే ఇలాగే ట్రాఫిక్‌జామ్ అవుతుంది కదా! 15 నిమిషాల్లో చేరుకోవాల్సిన గమ్యానికి గంట సేపు ప్రయాణించాల్సి వస్తుంది.

ఒకరు లేదా ఇద్దరు మాత్రమే ప్రయాణించే కారుకు ఎంత జాగ అవసరమవుతుందో ఒక్కసారి ఆలోచించండి. అదే జాగలో పట్టే బస్సు లేదా రైలు బోగీలో ఎంతోమంది ప్రయాణించవచ్చు. సొంత కార్లున్న ప్రతిఒక్కరూ వాటికి బదులు బస్సులను ఆశ్రయించినట్టు ఒక్కసారి ఊహించుకోండి. మన రోడ్లపై ప్రయాణం సాఫీగా సాగుతుంది కదా. ఆ బస్సులు ఎలక్ట్రికల్, హైబ్రిడో లేదా ఇతర హరిత ఇంధనంతో నడిచేవి అయితే, కాలుష్యం కూడా చాలా త్వరగా తగ్గిపోతుంది.

మన దేశంలోని ఢిల్లీ, ముంబై, బెంగళూరు నగరాలు ఆర్థిక కార్యకలాపాలకే కాదు, అర్బనైజేషన్‌కు కూడా ప్రసిద్ధి. అధిక జనాభా, ట్రాఫిక్‌జామ్, అర్బనైజేషన్ వల్ల కలిగే ఇబ్బందులకు ఈ నగరాలు ప్రతీతి. వీటిని అధిగమించేందుకు వివిధ ప్రతిపాదనలు, కార్యక్రమాలు ఉన్నప్పటికీ ఈ నగరాలు ఎప్పుడూ రద్దీగానే కనిపిస్తాయి. ప్రజా రవాణాను మెరుగుపరచడం, మెట్రో సేవలను మరింతగా విస్తరించడం లాంటి చర్యల ద్వారా కార్ల రద్దీని కొంత మేరకు తగ్గించవచ్చు. వాటికితోడు క్యాబ్‌లు, ఆటో రిక్షాలు ఉండనే ఉన్నాయి. అయినప్పటికీ చాలామంది సొంత వాహనాల్లో వెళ్లేందుకే ఇష్టపడతారు. రద్దీ ప్రదేశాల్లో కార్లకు అనుమతి నిరాకరించడం, పార్కింగ్ రుసుములను పెంచడం లాంటి చర్యల ద్వారా కార్ల వాడకాన్ని, తద్వారా ట్రాఫిక్‌ను నియంత్రించవచ్చు. కానీ, ప్రభుత్వాలు అలా చేయడం లేదు. అందుకు విరుద్ధంగా కార్ల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్నాయి. ఎందుకంటే, మన దేశంలో జరిగే కార్ల కొనుగోళ్లలో ఈ మూడు నగరాల వాటా చాలా ఎక్కువ. సుమారు 30-35 శాతం కార్లు ఈ నగరాల్లోనే అమ్ముడవుతున్నట్టు ఒక అంచనా. కార్ల వల్ల ట్రాఫిక్, కాలుష్యం లాంటి సమస్యలు ఉన్నప్పటికీ, అవి ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తున్నాయని చెప్పడంలో ఎలాంటి సంశయం అక్కర్లేదు.

ఒకవేళ ప్రజా రవాణా మెరుగైతే యథావిధిగా కార్ల కొనుగోళ్లు తగ్గిపోతాయి. ప్రజలు కొత్త కార్లను చాలా తక్కువ సంఖ్యలో కొనుగోలు చేస్తారు. ఇప్పటికే కార్లున్న వారు వాటిని మితంగా వాడతారు. అయితే, ఇది ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుంది. భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమ చాలా పెద్దది. దేశ జీడీపీలో ఈ రంగం వాటా సుమారు 7 శాతం. అంతే కాదు, లక్షల మందికి ఈ రంగం ఉపాధి కల్పిస్తున్నది. ఆటోమొబైల్ ఇండస్ట్రీ అంటే ఒక్క కార్లకు సంబంధించినది మాత్రమే కాదు. తయారీదారులు, డీలర్‌షిప్‌లు, సర్వీస్ సెంటర్లు, అనుబంధ పరిశ్రమలు ఇలా అనేకం అందులో భాగం. ఒక్కసారిగా కార్ల కొనుగోళ్లు పడిపోతే.. ఈ మొత్తం చైన్ సిస్టమ్ దెబ్బతింటుంది. పెట్టుబడులు తగ్గిపోతాయి. అది లేఆఫ్‌లకు దారితీస్తుంది. చివరికి పరిశ్రమలు మూతబడతాయి. ఆటోమొబైల్ రంగం ప్రత్యక్షంగా 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తున్నది. అంతేకాదు, దానిపై ఆధారపడి పరోక్షంగా లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. వీరంతా రోడ్డున పడతారు. అంతకుమించి 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యం నీరుగారిపోతుంది.

పన్నులు, డ్యూటీలు, ఇతరత్రా రూపంలో ఆటోమొబైల్ రంగం నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు భారీగా ఆదాయం వస్తున్నది. వాహనాలపై జీఎస్టీ, రోడ్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్ ఫీజులు, ఇంధనంపై ఎక్సైజ్ డ్యూటీల రూపంలో ఈ ఆదాయం ప్రభుత్వాలకు సమకూరుతున్నది. ఒక్కసారిగా కార్ల కొనుగోళ్లు పడిపోతే.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదాయం గణనీయంగా పడిపోతుంది. అది మౌలిక వసతులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రభావం చూపుతుంది. అందుకే బస్సు, మెట్రో లాంటి ప్రజా రవాణాను ప్రభుత్వాలు కొంతమేరకే అభివృద్ధి చేస్తాయే తప్ప, మనం కార్లు కొనడం మానేసేంత గొప్పగా మెరుగుపరచవు.

('కార్టాక్' సౌజన్యంతో..)

హైదరాబాద్‌లో తిరగలేకనే నల్గొండ యాత్ర

చీకట్లో చిల్లర పడేసుకొని వెలుతురులో వెతికాడట వెనుకటికొకడు. వాడు చీకట్లో వెతకడు.. వెలుతురులో ఎంత వెతికినా అది దొరకదు. తెలంగాణలో కాంగ్రెస్ చెప్పున్న 'ప్రజాపాలన' కూడా అచ్చం అలాంటిదే. పులికేసికి ఎక్కువ, పిచ్చి తుగ్లక్‌కు తక్కువలా సాగుతున్న కాంగ్రెస్ పాలనలో భూతద్దం పెట్టి వెతికినా 'ప్రజాపాలన' కనపించటం లేదు. అసలు రాష్ట్రంలో పాలన అంటూ ఒకటి ఏడిస్తేనే కదా.. ప్రజాపాలనో, పాపిష్ఠి పాలనో చెప్పడానికి.

డాక్టర్ దూదిమెట్ల బాలరాజు

ఆనాటి రోజులు తెస్తానని అసెంబ్లీ ఎన్నికలకు ముందు చెప్పినట్టే రేవంత్‌రెడ్డి ఆనాటి రోజులను నిజంగానే తీసుకొచ్చారు. అధికారంలోకి వస్తూనే నాడు ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రజలు పడ్డ కష్టాలను ఆయన మోసుకొచ్చారు. తాము అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యం తెస్తామని చెప్పినట్టే కాంగ్రెస్ నాయకులు నిజంగానే ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొచ్చారు. ఇందిరమ్మ కాలం నాటి ఎమర్జెన్సీ రోజుల్లో జరిగినట్టే అక్రమ కేసులు, అరెస్టులు, నిర్బంధాలు, అణచివేతలు రాష్ట్రంలో ఇప్పుడూ కొనసాగుతుండటమే అందుకు నిదర్శనం. మార్పు.. మార్పు.. అంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ పాలకులు నిజంగానే తెలంగాణలో మార్పు తీసుకొచ్చారు. అది అలాంటి ఇలాంటి మార్పు కాదు. సక్కగా సాగుతున్న తెలంగాణ సంసారాన్ని సర్వనాశనం చేసి రోడ్డున పడేశారు. కేసీఆర్ సర్కార్ ఇస్తున్న 'అసలు'కు కొసరు కూడా కలిపి ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ గప్పాలు కొట్టింది. కానీ, ఇప్పుడు కొసరు సంగతేమో గానీ, 'అసలు'కే ఎసరు పెట్టింది. ఆరు గ్యారెంటీలంటూ గద్దెనెక్కిన కాంగ్రెస్ నాయకులు వాటిని పూర్తిగా పక్కన పెట్టేసి.. తమకు గ్యారెంటీగా 'కమీషన్' వచ్చే మూసీ జపం చేస్తున్నారు. పాలనను పూర్తిగా గాలికి వదిలేసి స్కాములు చేసేందుకు పాకులాడుతూ 'స్కాంగ్రెస్' అన్న పేరును సార్థకం చేసుకుంటున్నారు.

అసలు మూసీ బ్యూటిఫికేషన్ అన్నదే అతి పెద్ద లూటిఫికేషన్. వృక్షంలోని వేర్లు, కొమ్మలను నరికేస్తే మధ్యనున్న మోడు బతుకుతుందా? అలాగే నదీ జన్మస్థానాన్ని నాశనం చేస్తే ఆ నది బతుకుతుందా? ఇప్పుడు రేవంత్ సర్కార్ చేస్తున్నదదే. ఓ వైపు నావికాదళం రాడార్ స్టేషన్ పేరిట మూసీ జన్మస్థానాన్ని నాశనం చేస్తూ, మరోవైపు మూసీ పక్కనే సిమెంట్ పరిశ్రమ పెట్టేందుకు అదానీ కంపెనీకి అనుమతిస్తూ నదిని పరిరక్షిస్తానని ప్రగల్భాలు పలకడం రేవంత్‌కే చెల్లింది. మూసీకి జీవనాధారమైన నీటి వనరును సర్వనాశనం చేస్తూ నదిని పరిరక్షిస్తామని చెప్పడం విడ్డూరం.

వాస్తవానికి, హైదరాబాద్ నగర పరిధిలో మూసీ ఎప్పుడో అన్యాకాంత్రమైపోయింది. ఒక పిల్ల కాలువ మాదిరిగా మారిపోయింది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్‌ల నిర్మాణం తర్వాత అసలు మూసీలో నీళ్ల రావడమే గగనమైపోయింది. నగరంలోని ఇండ్ల నుంచి వచ్చే మురుగునీరే మూసీకి దిక్కయ్యాయి. ఆ నీళ్లే లేకపోతే మూసీ ఎప్పుడో ఎడారిగా మారిపోయేది. మూసీని పరిరక్షించాలనుకుంటే మొదట నగరం నుంచి విడుదలయ్యే మురుగును శుద్ధిచేయాలి. అప్పుడే మూసీ సుందరీకరణ సాధ్యపడుతుంది. అందుకే, గత బీఆర్ఎస్ సర్కార్ మురుగునీటి శుద్ధికి ప్రాధాన్యమిచ్చింది. ఈ నేపథ్యంలో 31 నీటిశుద్ధి ప్లాంట్ల నిర్మాణాన్ని చేపట్టింది.

మూసీ పరిరక్షణ విషయంలో గత బీఆర్ఎస్ సర్కార్ అనుసరించిన మార్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తే సరిపోయేది. నిందలేయడం తప్ప.. నిర్మాణమే తెలియని హస్తం పాలకులు అలా ఎందుకు చేస్తారు? అలా చేస్తే అది కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకవుతుంది? అందుకే, కాంగ్రెస్ మార్క్ రాజకీయాన్ని వారు చేస్తున్నారు. అందులో భాగంగానే మూసీ వెంట నివసిస్తున్నవారి వద్ద నుంచి ఏండ్లుగా పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వం ఇప్పుడు వారిపైనే కబ్జాకోరులు, ఆక్రమణదారులు అని ముద్రవేశారు. రెండు, మూడు దశాబ్దాలుగా అక్కడే జీవనం సాగిస్తున్న నిరుపేదల గూళ్లను కూల్చడం అత్యంత హేయం. ఒక ప్యాకేజీ లేకుండా, నష్టపరిహారం ఇవ్వకుండా పేదలను రోడ్డున పడేశారు. రివర్‌బెడ్, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ అంటూ పేదలను ఖాళీ చేయిస్తున్న కాంగ్రెస్ సర్కార్ భవిష్యత్తులోనూ ఇలాగే వ్యవహరిస్తుందా? పేదలు ఖాళీ చేసిన జాగలను ఖాళీగానే వదిలేసి నదిని పరిరక్షిస్తారా? సుందరీకరణలో భాగంగా మూసీ చుట్టుపక్కల షాపింగ్ కాంప్లెక్స్‌లు, అద్దాల మేడలు, ఆకాశ హర్మ్యాలు నిర్మిస్తామని ప్రభుత్వం చెప్తున్నది. అంటే.. ఇది ఒకవిధంగా పేదలుండే జాగలను కొల్లగొట్టి పెద్దలకు కట్టబెట్టడమే. అదంతా జరగాలంటే చేతిలో చిల్లి గవ్వ లేని రేవంత్ సర్కార్‌కు పెట్టుబడి కావాలి. పేదలను బెదిరించి లాక్కుంటున్న భూములే ఆ పెట్టుబడి. రూ.లక్షన్నర కోట్లు పెట్టనున్న కంపెనీలకు ప్రభుత్వం ఇచ్చే పరిహారమే మూసీ చుట్టుపక్కల ఉన్న ల్యాండ్‌బ్యాంక్. ఆ భూముల్లోనే అద్దాల మేడలు వెలుస్తాయి. మరి అప్పుడు రివర్‌బెడ్‌లు, ఎఫ్‌టీఎల్‌లు, బఫర్‌జోన్‌లు ఉండవా? పేదలకు అడ్డువచ్చిన నిబంధనలు, నియమాలు పెద్దలకు వర్తించవా? వాస్తవానికి, పెద్దల మధ్య పేదలుండటం కాంగ్రెస్‌కు అస్సలు ఇష్టం ఉండదు. అందుకే,